సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 26 । అక్టోబర్ । 2023



మహామహులకు పట్టం

ఉద్యమాలకు పురిటిగడ్డ నల్లగొండ. ఇక్కడి నుంచి పోటీ చేసిన ఎంతో మంది మహామహులు గెలుపొందారు. - 10లో



కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 11లో



వాహనాల బారులు

దసరా పండుగకు స్వస్థలాలకు వచ్చిన ప్రజానీకం సెలవులు ముగియడంతో తిరుగు పయనమయ్యారు. - 12లో

న్యూస్‌రీల్

నేటి నుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం

భువనగిరి : విద్యా సంస్థలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు పాఠశాలలకు, 19 నుంచి 25వ తేదీ వరకు కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. సెలవులు ముగియడంతో తిరిగి నేడు విద్యా సంస్థలు తెరుచుకోనున్నాయి. పాలిటెక్నిక్ కళాశాలలు ఈ నెల 25నుంచే ప్రారంభం అయ్యాయి.

స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి

భువనగిరి క్రైం : మన దేశంలో మహిళలను గౌరవించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం అని, స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి అని జిల్లా ప్రధాన జడ్జి మారుతిదేవి పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం భువనగిరి కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి మురళీమోహన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వంచ దామోదర్‌రెడ్డి, బొబ్బల కేశవరెడ్డి, జి.బాబురావు, నరసింహ యాదవ్, జి.స్వామి, బొమ్మ వెంకటేష్, ఆకుల ఆంజనేయులు, పి.శ్రీధర్, ఎస్.రవికుమార్, అర్జున్, వేదేశ్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష లౌకిక పార్టీలను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: ఎన్నికల్లో ప్రజలు వామపక్ష లౌకిక పార్టీల అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. బుధవారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. అవినీతి, మతతత్వ, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలకు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం రాష్ట్ర నేత వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, వినోద్ నాయక్, పాపానాయక్, కోటిరెడ్డి, ఎర్ర నాయక్, సుభాని, గోపి, సర్వయ్య, హనుమంతు, కోటి పాల్గొన్నారు.

ఓటర్లకు ఫోన్ కాల్స్!

ఆత్మకూరు(ఎం) : ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి ఓటర్లకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజలకు నిరంతరం అండగా ఉంటామని అభ్యర్థులు హామీలు ఇస్తున్నట్లు ఓటర్లు చెబుతున్నారు. నేతల నుంచి ఫోన్ కావడం చర్చనీయాంశమైంది.

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అర్వపల్లి : రైతులకు సేవలందిస్తున్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గోపాల మిత్రల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బి. శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బుధవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కనీస వేతనం అమలు కాక చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గోపాలమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని, విధి నిర్వహణలో చనిపోయిన గోపాల మిత్రలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా రూ. 6లక్షలు వర్తింపజేయాలని కోరారు. అర్హత కలిగినవారికి వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షకు 50శాతం మార్కుల వెయిటేజీ కల్పించాలని, రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలని, నెల నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీరాములు, రమేష్‌యాదవ్, చక్రపాణి, వీరేశం, రాజు, భిక్షపతి, ఆల్దాస్ లింగయ్య, సురేందర్, అర్జున్ పాల్గొన్నారు.



సీఎం సభ కోసం సిద్ధం చేసిన వేదిక

నేడు మునుగోడుకు కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి
- 900 మంది పోలీసులతో బందోబస్తు

మునుగోడు: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మునుగోడులో జరిగే సీఎం కేసీఆర్ సభకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సర్వం సిద్ధం చేశారు. ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహిస్తున్న ఈ సభకు దాదాపు లక్ష మందికిపైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 176 గ్రామాలకు గాను ఒక్కో గ్రామం నుంచి 500 మంది సభకు హాజరయ్యేలా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జన సమీకరణ చేస్తున్నారు. అందుకు అవసరమైన వాహనాలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు నాయకులు చెబుతున్నారు. సీఎం సభ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి 900 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అందులో స్థానిక జిల్లా ఎస్పీతో పాటు ఒక అడిషన్ ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 75 మంది ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, మహిళ పోలీసు సిబ్బంది మొత్తం 809 మందితో పాటు 78 మంది బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది 57 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ అధికారులు చెప్పారు. వీరి అందరికి బుధవారం స్థానిక ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గతంలో ఏ ప్రభుత్వం కూడా మునుగోడును అభివృద్ధి చేయలేదు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే అభివృద్ధి జరిగింది. ఏడాది క్రితం జరిగిన ఉప ఎన్నికల అనంతరం కేవలం ఏడాది కాలంలోనే దాదాపు రూ.700 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. వీటి అన్నింటిని ప్రజా ఆశీర్వాద సభలో వివరించడంతో పాటు రానున్న రోజుల్లో చేపట్టే అభివృద్ధిని సీఎం కేసీఆర్ వివరిస్తారు. నియోజకవర్గంలోని ప్రజలు ఇంటికి ఇద్దరు చొప్పున సభకు తరలివచ్చి విజయవంతం చేయాలి.

–ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మునుగోడు

కాంగ్రెస్.. చేరికల జోష్

- బీజేపీకి రాజీనామా చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- రాజగోపాల్ చేరితే జోష్ పెరుగుతుందంటున్న కాంగ్రెస్ శ్రేణులు
- కాంగ్రెస్ కండువా వేసుకున్న బీఆర్‌ఎస్ నల్లగొండ జెడ్పీ ఫ్లోర్ లీడర్
- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సైతం 'హస్తం' గూటికి
- నల్లగొండ సహా ఇతర నియోజకవర్గాల్లోనూ భారీగా చేరికలు



ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నల్లగొండ జిల్లా కనగల్ మండలం శేరిలింగోటం గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ సైదులు తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. నల్లగొండ, కోదాడ, హుజూర్‌నగర్, నకిరేకల్, నాగార్జునసాగర్, భువనగిరి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీలో నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఎక్కువ మొత్తంలో నేతలు చేరుతున్నారు. తాజాగా మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. ఈ నెల 27వ తేదీన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరుగుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నారు. పైగా ఆయన ప్రభావం భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఉంటుందని చెబుతున్నారు. ఇన్నాళ్లుగా ఎవరికి వారుగా ఉన్న కాంగ్రెస్ పార్టీలోని రాజగోపాల్‌రెడ్డి అనుచరులంతా ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మళ్లీ ఏకం కాబోతున్నారని, దీంతో కాంగ్రెస్‌కు ఊపు వస్తుందని పేర్కొంటున్నారు.

కొనసాగుతున్న వలసల పరంపర

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అధికార పార్టీ నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ప్రచారం సాగుతుండటం.. దానికి తోడు కాంగ్రెస్ నేతలంతా ఏకమవుతుండటంతో ఆ పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయి. ఇన్నాళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో ఉంటూ అసమ్మతితో ఉన్న ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులంతా కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో పదిమందికి పైగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం తిప్పర్తి మండలానికి జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, ఎంపీపీలు, 9 మంది సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీకి దెబ్బమీద దెబ్బ పడినట్లు అయ్యింది.



బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వెంకట్‌రెడ్డి

ఒక్కటవుతున్నారు..

గతంలో జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులంతా ఎవరికి వారు అన్నట్లుగానే ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో నేతలంతా ఏకమవుతున్నారు. అంతా పార్టీ విజయానికి కలిసికట్టుగా పని చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జోష్ వచ్చింది.

- కోదాడ నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులంతా బీఆర్‌ఎస్ పార్టీని వీడి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.
- నాగార్జునసాగర్‌లో కూడా అదే పరిస్థితి నెలకొంది. భారీ ఎత్తున స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పాటు మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.
- ఇక నకిరేకల్‌లో గతంలో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసి గెలిచిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.
- భువనగిరిలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇలా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలోకి వలసల పరంపర రోజురోజుకు పెరుగుతోంది.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన తప్పనిసరి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి,యాదాద్రి : రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారితో సమావేశం అయ్యారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఫారమ్ 7–ఏపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్వీకరణ, వాటి పరిశీలన, ఉపసంహరణ చాల కీలకమని, వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నామినేషన్ల సందర్భంగా ఎవరెవరు ఏ పని చేయాలో ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రెండు కంప్యూటర్లు, స్కానర్, ఫ్యాక్స్, నాలుగు సెట్ల ఓటరు జాబితా, సీసీ టీవీ, వీడియోగ్రాఫర్, వాల్‌క్లాక్, పబ్లిక్ అడ్రస్ సిస్టం మైక్ తప్పనిసరిగా అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు. వీటితో పాటు అకౌంట్ రిజిస్టర్లు, ఎంసీసీ గైడ్ లైన్స్, హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవాలని, బారికేడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు.

అభ్యర్థులు 25 సంవత్సరాలు నిండి ఉండాలి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే నాటికి 25 ఏళ్ల వయస్సు నిండి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థుల జనన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నామినేషన్ వేశాక అభ్యర్థితో ప్రమాణం చేయించాలని, ప్రమాణం చేసినట్లుగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామినేషన్ వేయవచ్చన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు సమయం ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ తేదీ, స్వీకరించిన సమయం తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు, మిగతా వారు రూ.10వేలు చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు నామినేషన్ల ప్రక్రియ, నామినేషన్ల సందర్భంగా చేయవలసిన పనులు, చేయకూడని అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, తహశీల్దార్లు, ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో ఏకాదశి పూజలు

యాదగిరిగుట్ట : ఏకాదశి సందర్భంగా బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని శ్రీస్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, అర్చన, అభిషేకం చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



పుష్పాలంకరణలో ఉత్సవమూర్తులు

కొత్త సంఖ్యతో ఓటరు గుర్తింపు కార్డులు

- అవగాహన కోసం లేఖలు పంపుతున్న ఎన్నికల సంఘం

భువనగిరి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు భారత ఎన్నికల సంఘం ఓటరు గుర్తింపు కార్డుపై న్యూ స్టాండర్డ్ ఎపిక్ నంబర్లను కేటాయించేది. 2012 కంటే ముందు జారీ చేసిన కార్డుల వివరాలు ఆన్‌లైన్‌లోలభ్యం కావడం లేదు. ఇటువంటి వారికి పాతకార్డుల స్థానంలో కొత్త సిరీస్ నంబర్లు పొందుపర్చింది. 12 అంకెల నంబర్‌ను 10 అంకెలతో రూపకల్పన చేసింది. దీనిపై అవగాహన కోసం ఎన్నికల సంఘం కొత్త నంబర్లు పొందిన ఓటర్లకు లేఖలు కూడా పంపింది. వీటిని బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి అందజేస్తున్నారు. భువనగిరి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,11,362 మంది ఉండగా ఇందులో 49,257 మందికి కొత్త సిరీస్ నంబర్‌తో గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు.



ఎన్నికల సంఘం పంపిన లేఖలు

గూడూరులో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర తదితరులు

బీబీనగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీబీనగర్ మండలం గూడూరులో బుధవారం పోలీసులు, అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకువచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళి గురించి వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. మద్యం, డబ్బు పంపిణీ జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటరెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీవాణి, ఎంపీఓ స్వాతి, ఎస్‌ఐ యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ దక్కేదెవరికో?

- మునుగోడుపై ఉత్కంఠ
- ఆలేరులో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ
- రెండో విడత జాబితా కోసం ఎదురుచూపులు



సాక్షి, యాదాద్రి : జిల్లాలో ఆలేరు, మునుగోడు, నకిరేకల్ బీజేపీ అభ్యర్థుల ప్రకటనపై సస్పెన్స్ కొనసాగుతోంది. తొలి జాబితాలో భువనగిరి, తుంగతుర్తి అభ్యర్థుల పేర్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో జాబితాపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర జిల్లా కేడర్‌లో జోష్ నింపింది. ఆ తర్వాత మునుగోడు ఉప ఎన్నికతో పార్టీలో మరింత జోష్ పెరిగింది. వీటితో పాటు పార్టీ విస్తృతంగా చేపట్టిన కార్యక్రమాలతోనూ ప్రజల్లో ఆదరణపెరిగింది. దీంతో ఆశావహులు టికెట్ కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే వివిధ సంస్థలు చేసిన సర్వేల ఆధారంగా భువనగిరి, తుంగతుర్తి టికెట్లు ప్రకటించిన అధిష్టానం.. ఆలేరు, మునుగోడు, నకిరేకల్‌ను పెండింగ్‌లో పెట్టింది. భువనగిరి నుంచి గూడూరు నారాయణరెడ్డి, తుంగతుర్తి నుంచి కడియం రామచంద్రయ్య పేర్లను ఖరారు చేసింది.

అందరి దృష్టి మునుగోడుపైనే..

మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో మునుగోడు టికెట్ ఎవరికి ఇస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తొలి జాబితాలోనే రాజగోపాల్‌రెడ్డి పేరు వస్తుందని బీజేపీ శ్రేణులు, ఆయన అనుచరులు ఆశించారు. కానీ, ఆయన పేరు లేకపోవడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్‌లో చేరతారని కొంతకాలంగా జరుగుతున్న చర్చకు ఎట్టకేలకు రాజగోపాల్‌రెడ్డి తెరదించారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే శక్తి బీజేపీకి లేదని, కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయంగా కన్పిస్తుందని భావించి తన రాజీనామా ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలేరు నుంచి ఐదుగురు ప్రయత్నం

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు అభ్యర్థిగా దొంతిరి శ్రీధర్‌రెడ్డి పేరును తొలి విడతలోనే ప్రకటించారు. ఈసారి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌ను పోటీ చేయాలని పార్టీ అధిష్టానం కోరినప్పటికీ ఆయన తిరస్కరించారు. ప్రస్తుతం పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, సూదగాని హరిశంకర్‌గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, పల్లెపాటి సత్యనారాయణలు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరంతా ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. వీరిలో కాసం వెంకటేశ్వర్లు 2009, 2014లో ఆలేరు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. నకిరేకల్‌లో భువనగిరికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి పోటీ చేసి పరాజయంపాలయ్యారు.

బూర నర్సయ్యగౌడ్‌పై అధిష్టానం ఆసక్తి

రాజగోపాల్‌రెడ్డి బీజేపీని వీడడంతో మునుగోడు నుంచి ఆ పార్టీ తరఫున ఎవరు పోటీ చేయనున్నారనే చర్చకు తెరలేచింది. భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను బరిలోకి దించేందుకు బీజేపీ అధిష్టానం పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. అయితే బూర నర్స య్యగౌడ్ మాత్రం ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి 2018లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన గంగిడి మనోహర్‌రెడ్డికి టికెట్ వస్తుందని బీజేపీలోని ఒక వర్గం ప్రచారం చేస్తోంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): చదువు మధ్యలో మానేసిన వారికి ఉచితంగా నాలుగు నెలల పాటు ఇచ్చే మొబైల్ రిపేరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27 నుంచి నవంబర్ 5 వరకు నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

బీఎల్‌ఓలకు 12-డీ ఫారాలపై అవగాహన

భువనగిరిటౌన్ : దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వ్యక్తులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచి ఓటు ఓసే అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన 12–డీ ఫారాలను బూత్ లెవల్ అధికారులు వారికి అందజేయనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారు 12–డీ ఫారం నింపి నవంబర్ మొదటి వారంలోపు అందజేయాలి. అందిన ఫారాలను అధికారులు పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉంటే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. కాగా భువనగిరి మండలం, మున్సిపాలిటీ చెందిన బీఎల్‌ఓలకు 12–డీ పత్రాలపై బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అంజిరెడ్డి

కుటుంబ సమేతంగా..

సాక్షి, యాదాద్రి : భువనగిరి నియోజకవర్గంలోని అభ్యర్థులు, ఆశావాహులతో పాటు వారి కుటుంబీకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. హ్యాట్రిక్ విక్టరీ సాధించేందుకు ఉవ్విళ్లూరుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అందరికన్నా ముందుగానే తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఇటీవల సీఎం సభ సక్సెస్ కావడంతో ఊపు మీదున్న ఆయన ప్రచారాన్ని మరింత ముమ్మరంగా చేశారు. శేఖర్‌రెడ్డి భార్య వనితారెడ్డి, కూతురు మన్వితారెడ్డిలు కూడా వారం రోజులుగా విడివిడిగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. తన భర్త చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను దృష్టిలోపెట్టుకుని మూడోసారి గెలిపించాలని వనిత ఓటర్లను కోరుతున్నారు. నాన్నకు మూడోసారి అవకాశం ఇవ్వాలని కూతురు మన్వితా భువనగిరి పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్ నేత కూడా..

కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఇంకా పేరు ఖారారు కానప్పటికీ ప్రచారం ముమ్మరం చేశారు. టికెట్ తనకే వస్తుందన్న నమ్మకంతో ప్రచారం చేసుకుంటున్నారు. పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్ మండలాలపై ఆయన దృష్టిపెట్టారు. అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం పెద్ద కూతురు కీర్తిరెడ్డి, కుమారుడు శ్రీరాంరెడ్డి కూడా వారం క్రితం నుంచి ప్రచారంలోకి దిగారు. పలు గ్రామాల్లో గ్రామ కమిటీలతో సమావేశమై తమ తండ్రి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు.


పైళ్ల శేఖర్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి వనిత


వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న శేఖర్‌రెడ్డి కుమార్తె మన్వితారెడ్డి


వలిగొండలో ఓటర్లతో మాట్లాడుతున్న కుంభం అనిల్ భార్య కిరణ్‌జ్యోతి


ప్రచారం చేస్తున్న కుంభం అనిల్ కుమారుడు శ్రీరామ్‌రెడ్డి

ఐదు రోజులే గడువు

- కొత్తగా ఓటరు నమోదుకు ఈ నెల 30 వరకు చివరి అవకాశం

నల్లగొండ: ఓటరు నమోదుకు 5 రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అంతకు ముందే ఎన్నికల సంఘం ఓటరు నమోదు, ఓటరు లిస్టులో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలో పెద్దఎత్తున ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. అయితే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారికి ఓటు నమోదుకు మరో అవకాశం కల్పించారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకుంటే కొత్తగా ఓటు హక్కును కల్పిస్తారు. వారందరూ నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులవుతారు.

రూ.8.12 లక్షల నగదు, మద్యం సీజ్

నల్లగొండ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో బుధవారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు చూపని నగదుతో పాటు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. రూ.7.11 లక్షల నగదుతో పాటు రూ.లక్ష విలువ చేసే ఇతర వస్తువులు, రూ.1867 విలువ చేసే మద్యాన్ని పోలీసుల తనిఖీల్లో పట్టుకుని కేసులు నమోదు చేశారు.

'మునుగోడు' లో పెరిగిన పోలింగ్ స్టేషన్లు


చండూరు : పడమటితాళ్ల గ్రామంలో ఏర్పాటుచేసిన నూతన పోలింగ్ స్టేషన్

చండూరు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మునుగోడు నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల సంఖ్యను అధికారులు పెంచారు. దీంతో ఆయా గ్రామాల ఓటర్లకు దూరభారం తగ్గింది. మునుగోడు నియోజవకవర్గ వ్యాప్తంగా గతంలో 298 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. మరో 9 పోలింగ్ కేంద్రాలు పెంచడంతో ఆ సంఖ్య 307కు చేరింది. చౌటుప్పల్‌లో 4 పోలింగ్ కేంద్రాలను పెంచారు. ఇందులో చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో మూడు, రూరల్ పరిధిలోని చింతలగూడెంలో ఒకటి ఏర్పాటు చేశారు. గట్టుప్పల మండల పరిధిలో శేరిగూడెంలో ఒకటి పెంచారు. చండూరు మండల పరిధిలో పడమటితాళ్ల, నాంపల్లి మండలంలో 3 కేంద్రాలు పెంచారు. ఇందులో జాన్‌తండా, షర్భాపురం, సుంకిశాల గ్రామాలు ఉన్నాయి.

మహామహులకు పట్టంకట్టిన నల్లగొండ

జంగ్ తెలంగాణ


బొమ్మగాని ధర్మభిక్షం


నందమూరి తారక రామారావు


గుత్తా మోహన్‌రెడ్డి


మల్‌రెడ్డి రఘుమారెడ్డి


చకిలం శ్రీనివాసరావు


గడ్డం రుద్రమదేవి


నంద్యాల నర్సింహారెడ్డి


కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


కంచర్ల భూపాల్‌రెడ్డి

- ఎన్టీఆర్ కూడా ఇక్కడి నుంచి పోటీ
- కాంగ్రెస్ అభ్యర్థులే ఎక్కువసార్లు విజయం
- తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని మలిదశ ఉద్యమంలోనూ కీలక భూమిక
- ఒకనాడు తాగునీటికి ఇబ్బందులు.. నేడు పసిడి పంటలకు నెలవు
- విద్య, వైద్య రంగంలోనూ పురోగతి



అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

నల్లగొండ: ఉద్యమాలకు పురిటిగడ్డ నల్లగొండ. తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకుని.. తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించిన చరిత్ర నల్లగొండది. కాకతీయుల కాలం నాటి శిల్ప సంపదతో పానగల్ దేవాలయాలు ప్రసిద్ధిచెందాయి. ప్రస్తుతం విద్య, వైద్య రంగాల్లో ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ద్వారా వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాగార్జున డిగ్రీ కళాశాలకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది.

ధాన్య భాండాగారంగా..

నల్లగొండ ధాన్య భాండాగారంగా మారింది. ఒకనాడు తాగునీటికే ఇబ్బందులు ఉండేవి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నప్పటికీ స్థానికంగా నివాసం ఉండేందుకు ఇష్టపడకపోయేవారు. కృష్ణా జలాలు నల్లగొండకు రావడం, ఆ పరిసర గ్రామాల్లో చెరువులు నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగాయి. పానగల్ ఉదయ సముద్రం నుంచి నల్లగొండ పట్టణంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలకు కృష్ణా జలాలు అందుతున్నాయి. చెరువులను నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగి సాగు కూడా పెరిగింది. వరి దిగుబడిలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా మొదటిస్థానంలో ఉండగా.. అందులో నల్లగొండ నియోజకవర్గంలోనే అత్యధిక వరి సాగైంది. ఈ నల్లగొండ నియోజకవర్గంలో బత్తాయి సాగు కూడా అధికంగానే ఉంది.

ఏడుసార్లు కాంగ్రెస్ విజయం..

నల్లగొండ నియోజక వర్గం 1952లో ఏర్పడింది. ఆనాటి నుంచి ఒక ఉప ఎన్నికతో పాటు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో అత్యధికంగా ఏడుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. ఆ తర్వాత టీడీపీ మూడుసార్లు, పీడీఎఫ్ రెండుసార్లు గెలుపొందాయి. సీపీఎం, సీపీఐ, టీఆర్ఎస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కోసారి గెలిచారు. నల్లగొండ నియోజకవర్గం గతంలో ఐదు మండలాలతో కలిపి ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో నల్లగొండ పట్టణంతో పాటు నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాలతో నియోజకవర్గం ఏర్పడింది.

కోమటిరెడ్డిదే రికార్డు..

నల్లగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వరుసగా నాలుగు సార్లు గెలిచారు. ఈ సెగ్మెంట్ నుంచి ఈయన ఒక్కరే హ్యాట్రిక్ సాధించారు. 1999 నుంచి 2014 వరకు వరుసగా గెలిచి రికార్డు నెలకొల్పారు. చకిలం శ్రీనివాసరావు, గుత్తా మోహన్‌రెడ్డిలు రెండు పర్యాయాల చొప్పున విజయం సాధించారు.

ఎన్టీ రామారావు గెలుపు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు కూడా నల్లగొండ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1985 ఎన్నికల్లో ఎన్టీఆర్ రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. అందులో నల్లగొండ కూడా ఉంది. మూడు చోట్ల నుంచి కూడా గెలుపొందిన ఎన్టీఆర్.. నల్లగొండ స్థానానికి రాజీనామా చేశారు. అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ నుంచి గడ్డం రుద్రమదేవి పోటీచేసి గెలుపొందారు.

ఇద్దరు మంత్రులు

నల్లగొండ నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారిలో ఇద్దరు మంత్రులుగా పనిచేశారు. ఒకరు గుత్తా మోహన్‌రెడ్డి, మరొకరు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నాదెండ్ల భాస్కర్‌రావు కేబినేట్‌లో గుత్తా మోహన్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైఎస్సార్ మంత్రివర్గంలో, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో కూడా పనిచేశారు.

నల్లగొండ నియోజకవర్గంలో గెలుపొందిన ఎమ్మెల్యేలు వీరే..

సం.	గెలుపొందినవారు	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952(ద్వి)	లక్ష్మయ్య	పీడీఎఫ్	సాయిలు	కాంగ్రెస్
	కె. రమారెడ్డి	పీడీఎఫ్	బీఆర్ రావు	కాంగ్రెస్
1957	వెంకటరెడ్డి	పీడీఎఫ్	కేఆర్ రెడ్డి	కాంగ్రెస్
1962	బి. ధర్మబిక్షం	సీపీఐ	మహ్మద్‌ఫారూక్	కాంగ్రెస్
1967	చకిలంశ్రీనివాసరావు	కాంగ్రెస్	జీసా ఎలమంద	సీపీఎం
1972	చకిలంశ్రీనివాసరావు	కాంగ్రెస్	కేపీ రెడ్డి	సీపీఎం
1978	గుత్తామోహన్‌రెడ్డి	కాంగ్రెస్(ఐ)	చకిలం శ్రీనివాసరావు	జనతా
1983	గుత్తామోహన్‌రెడ్డి	ఇండిపెండెంట్	రుద్రమదేవి	టీడీపీ
1985	ఎన్టీఆర్	టీడీపీ	రామచంద్రరెడ్డి	కాంగ్రెస్
1985(ఉ.ఎ.)	రుద్రమదేవి	టీడీపీ	జి.మోహన్‌రెడ్డి	కాంగ్రెస్(ఐ)
1989	ఎం. రఘుమారెడ్డి	టీడీపీ	గుత్తా మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
1994	నంద్యాలనర్సింహారెడ్డి	సీపీఎం	చకిలం శ్రీనివాసరావు	కాంగ్రెస్
1999	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్	నంద్యాల నర్సింహారెడ్డి	సీపీఎం
2004	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్	గుత్తా సుఖేందర్‌రెడ్డి	టీడీపీ
2009	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్	నంద్యాల నర్సింహారెడ్డి	సీపీఎం
2014	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్	కంచర్ల భూపాల్‌రెడ్డి	ఇండిపెండెంట్
2018	కంచర్ల భూపాల్‌రెడ్డి	టీఆర్ఎస్	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	కాంగ్రెస్

105 మంది ఓటర్లు మాత్రమే..

- రాష్ట్రంలోనే చిన్న పంచాయతీగా బృందావనపురం


బృందావనపురం గ్రామ పంచాయతీ భవనం

త్రిపురారం: మండలంలోని బృందావనపురం తెలంగాణ రాష్ట్రంలోనే చిన్న గ్రామ పంచాయతీగా కొనసాగుతుంది. అప్పట్లో పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు వార్డుల్లో ఉన్న బృందావనపురం 1978లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 256వ పోలింగ్ బూత్ పరిధిలో 105 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. కామారెడ్డిగూడెం, కంపాలపల్లి, మునగబావిగూడెం గ్రామాలతో కలిపి కొణతాలపల్లి ఎంపీటీసీ పరిధిలో బృందావనపురం ఉంది.

సర్పంచులు వీరే..

1978లో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన సమయంలో ఎస్సీ రిజర్వేషన్ రావడంతో మైనం మల్లయ్య మొదటి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండోసారి జనరల్ రిజర్వేషన్ రావడంతో శ్రీరామ్‌రెడ్డి, మూడో సర్పంచ్‌గా బీసీ రిజర్వేషన్‌లో భాగంగా సైదాచారి, నాల్గో సర్పంచ్‌గా రమణారెడ్డి, ఐదో సర్పంచ్‌గా ప్రవీణ, ఆరో సర్పంచ్‌గా రమణారెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం వంగాల అలివేలు సర్పంచ్‌గా కొనసాగుతుండగా, ఇదే గ్రామానికి చెందిన మందాడి కవిత కొణతాపల్లి ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

అభివృద్ధికి తోడ్పాటునిస్తారు



మా గ్రామం చిన్న గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం ఉన్నా ప్రతి ఏటా గ్రామాభివృద్ధికి నిధులు పెంచాలి. గ్రామస్తులు సైతం కలిసికట్టుగా అభివృద్ధికి తోడ్పాటునందిస్తారు.
– మందాడి కవిత, ఎంపీటీసీ, కొణతాలపల్లి

ఇతర గ్రామాలకు ఆదర్శం..

చిన్న గ్రామ పంచాయతీ అయినప్పటికీ ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉంటారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎవరైనా కేవలం 4 నుంచి 5 ఓట్ల మెజార్టీతోనే విజయం సాధిస్తారు. పాలకవర్గం, ప్రజలు కలిసి గ్రామంలో వసతుల కల్పనపై దృష్టి సారిస్తూ మిగతా గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మనమంతా ఒక్కటే..



వలిగొండ మండలంలోని నెమిలకాల్వలో బుధవారం సీనియర్ నాయకుడు వంగాల స్వామిగౌడ్ అంత్యక్రియలకు హాజరైన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఒకరితో ఒకరు ముచ్చటించుకున్నారు. అనిల్‌కుమార్‌రెడ్డి ఇటీవల బీఆర్ఎస్‌లోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్‌లో వచ్చిన తర్వాత వీరిద్దరు కలుసుకోవడం ఇదే మొదటి సారి. కాగా వీరిద్దరు మాట్లాడుకుంటుండగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా గమనించారు.
– వలిగొండ

భవిష్యత్తును అమ్ముకున్నట్టే..



'ఓటు అమ్ముకుంటే మీ బిడ్డల భవిష్యత్తు అమ్ముకున్నట్టే.. మీరే నిర్ణయించుకోండి' 'మై ఓట్ నాట్ ఫర్ సేల్' అని టీ షర్టులపై నినాదాలు ముద్రించుకొని బుధవారం తెలంగాణ బ్లాక్ వాయిస్ ఆధ్వర్యంలో నల్లగొండలో ర్యాలీ బైక్‌లపై నిర్వహించారు. ఓటు ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

హత్య కేసులో నిందితుల అరెస్టు


మాట్లాడుతున్న సీఐ బ్రహ్మమురారి

తుంగతుర్తి: మండల పరిధిలోని రామన్నగూడెం తండాలో ఈనెల 24న మంగళవారం తెల్లవారుజామున జరిగిన భూక్యా హర్జ(49) హత్య కేసులో నిందుతులను అరెస్టు చేసినట్లు సీఐ బ్రహ్మమురారి తెలిపారు. హత్య కేసు వివరాలను బుధవారం తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆయన వెల్లడించారు. రామన్నగూడెంతండాకు చెందిన మృతుడు హర్జకు అతని భార్య కైకకు భూమి, అప్పుల విషయంలో కొంతకాలంగా జరుగుతున్న గొడవల కారణంగా తల్లి, వారి కొడుకు సురేష్‌లు కలిసి దసరా రోజున కత్తిపీటతో అతడి తలపై కొట్టి చంపి పారిపోయారు. నిందితుల కోసం పోలీసులు గాలించగా బుధవారం ఉదయం కోర్టులో లాయర్‌ను కలవాలనే ఉద్దేశ్యంతో 365 తుంగతుర్తి జాతీయ రహదారి (వై జంక్షన్) వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా వీరిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా తన భర్త హర్జ అప్పు చేసి అవి తీర్చడానికి పొలాన్ని అమ్మి, అప్పు తీర్చకుండా రోజు తాగి వచ్చి తమను బెదిరిస్తున్నాడని, అందుకే హత్య చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. కేసును త్వరగా ఛేదించడంతో పోలీసు సిబ్బందిని డీఎస్పీ నాగభూషణం అభినందించారు. సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ రాంకోటి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, రైటర్లు లింగరాజు, నరేష్, సిబ్బంది అశోక్, సతీష్, రవి, తదితరులున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా ఇంట్లో మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీకి చెందిన పండ్ల నాగరాజు తన ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ చేశాడనే సమాచారం మేరకు సోదాలు చేయగా 10 కాటన్లలో 480 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

చౌటుప్పల్: పట్టణ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దొడ్ల ఊషయ్య లింగోజిగూడెం గ్రామంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. చౌటుప్పల్‌లోని పద్మశాలి కాలనీలో నివాసం ఉంటున్నాడు. రోజువారి మాదిరిగా బుధవారం ఉదయం ఐదున్నర గంటలకు విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి సైకిల్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో పట్టణ శివారులోని మల్లిఖార్జున వే–బ్రిడ్జి వద్దకు చేరుకోగానే హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో అతివేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అల్లుడు పాలెం శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

బొలేరో వాహనాన్ని ఢీకొట్టి..

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బోయ రాజు(34) మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగకు నకిరేకల్ మండలం గోరెంకలపల్లికి వెళ్లాడు. మంగళవారం రాత్రి బైక్‌పై డ్యూటీకి వెళ్తూ తిప్పర్తి మండలంలోని మామిడాల స్టేజీ వద్ద ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి బోయ భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

సీనియర్ నేత వంగాల స్వామిగౌడ్ మృతి


స్వామిగౌడ్ (ఫైల్)

నల్లగొండ టూటౌన్, వలిగొండ: ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసిన సీనియర్ నాయకుడు వంగాల స్వామిగౌడ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన స్వస్థలం వలిగొండ మండలంలోని నెమిలకాల్వ. 1952 జూన్ 10న రామన్నపేటలో జన్మించారు. ప్రాథమిక విద్య రామన్నపేటలో, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్లో పూర్తిచేశారు. ఆయనకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. ఆయన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. 2004 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన స్వామిగౌడ్ 2004లో మిర్యాలగూడ పార్లమెంట్ స్థానంలో సూదిని జైపాల్‌రెడ్డిపై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2009 నుంచి 2014 వరకు రెండుమార్లు టీడీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018 ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీలోనే కొనసాగుతున్నా అనారోగ్యం కారణంగా కొంతకాలంగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. వ్యాపారవేత్తగా కూడా స్వామిగౌడ్‌కు గుర్తింపు ఉంది. క్రషర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. స్వామిగౌడ్ అంత్యక్రియలు స్వగ్రామం నెమిలకాల్వలో బుధవారం నిర్వహించారు.


స్వామిగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


నెమిలకాల్వలో స్వామిగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నివాళులర్పించిన నాయకులు..

నల్లగొండ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో వంగాల స్వామిగౌడ్ నివాసంలో ఆయన భౌతికకాయానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, మాజీ మున్సిపల్ చైర్మన్ పుల్లెంల వెంకట్‌నారాయణగౌడ్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ నివాళులర్పించారు. అదేవిధంగా నెమిలకాల్వలో నిర్వహించిన స్వామిగౌడ్ అంత్యక్రియలకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్యగౌడ్, యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్కుమార్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.


నల్లగొండలోని స్వామిగౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి


స్వామిగౌడ్ భౌతికకాయానికి పూలమాల వేస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ వంగాల ఈశ్వరయ్యగౌడ్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొండమల్లేపల్లి: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన బిజిలి రామాంజనేయులు(45) 20 ఏళ్ల క్రితం కుటుంబంతో కలిసి కొండమల్లేపల్లి పట్టణానికి వలస వచ్చి వెంకటేశ్వరనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. అతడికి భార్య ధనమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి పని ఉందని చెప్పి బయటకు వెళ్లిన రామాంజనేయులు తమ ఇంటి పక్కనే ఉన్న ఖాళీ సలంలోని రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. కాగా రామాంజనేయులు మృతికి గల కారణాలు తెలియరాలేదు.